
సాక్షి
నిర్మల్
గురువారం । 25 । మే । 2023



ఆకలి తీర్చుదాం 8లో▸

జిల్లాలో ఆకలితో అలమటిస్తున్న అభాగ్యులకు కొన్ని స్వచ్ఛందసంస్థలు అమ్మలా మారాయి. శుభకార్యాలు జరిగిన చోట మిగిలిపోయిన ఆహారం తెచ్చి వారి ఆకలి తీరుస్తున్నాయి.



రోడ్లపైనే మురుగునీరు

సారంగాపూర్ మండలంలోని పలు గ్రామపంచాయతీల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. రోడ్లపైకి మురుగునీరు చేరగా గ్రామస్తులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. 9లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
40.0 /28.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఎండ తీవ్రత కొనసాగుతుంది. వడగాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఉక్కపోత అధికంగా ఉంటుంది.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌లొచ్చారు



జిల్లాకేంద్రంలోని బోధనాస్పత్రి



ప్రొఫెసర్ నుంచి నియామక పత్రాలు తీసుకుంటున్న వైద్యులు

- మెడికల్ కాలేజీలో నియామకం
- 33 పోస్టులకు 22మందికి పత్రాలు
- జాయినైన పలువురు వైద్యులు
- త్వరలో మిగతా సిబ్బంది కూడా..
- వేగంగా భవన నిర్మాణ పనులు

నిర్మల్: రానున్న విద్యాసంవత్సరంలోనే కొత్త మెడికల్ కాలేజీ ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించి ఒక్కో అడుగు ముందుకు పడుతోంది. ఇటీవలే ఎంసీఐ అనుమతి పొందిన నిర్మల్ వైద్యకళాశాలకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) అసిస్టెంట్ ప్రొఫెసర్‌లను కేటాయించింది. మొత్తం 33 పోస్టులకు గాను కళాశాల అవసరాలు, అందుబాటులో ఉన్న వైద్యుల ప్రకారం 22మందిని నియమించింది. ఈమేరకు సంబంధిత వైద్యులు అసిస్టెంట్ ప్రొఫెసర్‌లుగా నియామక పత్రాలను ప్రిన్సిపల్ జేవీడీఎస్ ప్రసాద్, ప్రొఫెసర్ నుంచి అందుకున్నారు.

నియామకాల వేళ..

జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరు కాగానే ముందుగా ప్రిన్సిపల్‌ను నియమించారు. అనంతరం జిల్లా ఆస్పత్రిని తాత్కాలిక వైద్య కళాశాల, బోధనాస్పత్రిగా మార్చారు. అందుబాటులో ఉన్న సౌకర్యాలతో 2023–24 విద్యాసంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించేలా ప్లాన్ చేస్తున్నారు. మొత్తం 100 సీట్లతో వైద్యకళాశాల తరగతులు ప్రారంభం కానున్నాయి. తాత్కాలికంగా ఆస్పత్రి అందుబాటులో ఉండడం, ప్రవేశ పరీక్ష, కౌన్సెలింగ్ తర్వాత విద్యార్థులు రానుండడంతో వారికి కావాల్సిన బోధన, బోధనేతర సిబ్బంది నియామక ప్రక్రియను డీఎంఈ వేగవంతం చేసింది. ఇందులో భాగంగానే 22 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను నియమించింది. ఎంపికైనవారిలో బుధవారం వరకు 21మంది వైద్యులు ప్రిన్సిపల్ నుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామక పత్రాలు అందుకున్నారు. త్వరలోనే మిగతా బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బందిని నియమించనున్నట్లు వైద్యవర్గాలు పేర్కొన్నాయి.

శరవేగంగా నిర్మాణం

నిర్మల్ మెడికల్ కాలేజీ కోసం ప్రస్తుతం జిల్లా ఆస్పత్రిలోనే బోధన తరగతులు ప్రారంభించనున్నారు. ఇదే ఆస్పత్రిలో మరో అంతస్తు నిర్మాణం కొనసాగుతోంది. దీంతో పాటు కళాశాల కోసం మల్లన్నగుట్ట ఎదుట చేపడుతున్న 300 పడకల ఆస్పత్రిని కూడా శరవేగంగా నిర్మిస్తున్నారు. రెండుచోట్లా ఇప్పటికే మేజర్ పనులు పూర్తికావస్తున్నాయి. విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి దాదాపు పూర్తిచేసే అవకాశాలున్నట్లు వైద్యవర్గాలు పేర్కొన్నాయి. వీటితో పాటు విద్యార్థులు, బోధన సిబ్బందికి సంబంధించిన హాస్టల్, క్వార్టర్లను నియమించాల్సి ఉంటుంది. పూర్తిస్థాయి బోధనాస్పత్రి, వైద్యకళాశాల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుంది.

వైద్యవిద్యపై ఇష్టంతోనే..

ప్రస్తుతం ఆర్థోపెడిక్ వైద్యుడిగా సేవలందిస్తున్నాను. నిర్మల్‌లో వైద్యకళాశాల అందుబాటులోకి రావడం గొప్పవిషయం. వైద్యవిద్యపై మక్కువతో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా జాయిన్ అయ్యాను.

– డాక్టర్ అరుణ్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్

నియామకాలు కొనసాగుతున్నాయి

నిర్మల్ ప్రభుత్వ మెడికల్ కళాశాలకు సంబంధించిన అసిస్టెంట్ ప్రొఫెసర్‌ల నియామక ప్రక్రియ కొనసాగుతోంది. మొత్తం 22పోస్టులకు 21మంది ఎంపికయ్యారు. ఇప్పటివరకు ఆరుగురికి నియామక పత్రాలు అందించాం.

– డాక్టర్ జేవీడీఎస్ ప్రసాద్, ప్రిన్సిపల్, వైద్యకళాశాల

మంత్రి 'అల్లోల' శుభాకాంక్షలు

నిర్మల్ మెడికల్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌లుగా నూతనంగా నియమితులైన వైద్యులకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. మెడికల్ కాలేజీ ప్రారంభంతో వైద్యవిద్య అందుబాటులోకి రావడమే కాకుండా మెరుగైన వైద్యసేవలు ప్రజలకు అందనున్నాయని చెప్పారు. జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలన్న సీఎం కేసీఆర్ లక్ష్యంలో భాగంగా నిర్మల్‌లో వైద్యవిద్య అందుబాటులోకి వచ్చిందని పేర్కొన్నారు. మారుమూల ప్రాంతాలకూ సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందనున్నాయని మంత్రి తెలిపారు.

దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. బుధవారం కలెక్టర్ సమావేశ మందిరంలో జూన్ 2నుంచి 22వరకు నిర్వహించనున్న ఉత్సవాలపై ఎస్పీ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి జిల్లా అధికారులతో ముందస్తు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 21రోజులపాటు నిర్వహించనున్న వేడుకల షెడ్యూల్‌ను వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో నిర్వహించే ఉత్సవాల కోసం ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతీశాఖ పదేండ్ల ప్రగతి నివేదిక, అభివృద్ధి పథకాలపై ఫ్లెక్సీ, సక్సెస్ స్టోరీ, ఫొటోగ్యాలరీ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించాలని తెలిపారు. ప్రతీ గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామసభలు నిర్వహించి ఆయా శాఖల వారీగా ఉత్తమ సేవలందించిన సిబ్బందికి అవార్డులు ప్రదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, డీఆర్వో లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

గైడ్‌వాల్ మరమ్మతు పనులు ప్రారంభం



కొనసాగుతున్న మరమ్మతు పనులు

సాక్షి ఎఫెక్ట్..

ఖానాపూర్: మేడంపల్లి పంచాయతీ పరిధి సదర్మాట్ వద్ద దెబ్బతిన్న గైడ్‌వాల్ మరమ్మతు పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. 'నత్తనడకన సదర్మాట్ పనులు' శీర్షికన మంగళవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సంబంధిత జిల్లా అధికారి శ్రీనివాస్ ఆదేశాల మేరకు మేడంపల్లిలోని సదర్మాట్ వద్ద దెబ్బ తిన్న గైడ్‌వాల్ మరమ్మతు పనులతోపాటు సదర్మాట్‌లో పేరుకుపోయిన పూడిక తొలగింపు పనులు చేపట్టారు. సుమారు రూ.కోటిన్నరతో సదర్మాట్ వద్ద పూర్తిస్థాయిలో మరమ్మతు పనులు చేస్తామని డీఈ సురేందర్, జేఈ ఉదయ్ తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని, సకాలంలో పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

'సీఎం కేసీఆర్ దృష్టికి సమస్యలు తీసుకువెళ్తా'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసారూరల్: ఐకేపీ వీవోఏల సమస్యలు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం భైంసా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వీవోఏలు చేపట్టిన సమ్మెకు మద్దతు తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు సోలంకి భీంరావు, శంకర్‌చౌహాన్, తూము రాజేశ్వర్, బుచ్చన్న, గంగాధర్, సంజీవ్‌రెడ్డి, గజానంద్, దత్తుగౌడ్ తదితరులున్నారు.

ప్రజల భద్రత కోసమే తనిఖీలు



తాండ్రలో మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

మామడ: ప్రజల భద్రత కోసమే తనిఖీలు నిర్వహిస్తున్నామని డీఎస్పీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తాండ్ర గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వాహన యజమానులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. గ్రామంలోని 55ద్విచక్రవాహనాలు, నాలుగు ఆటోలు, ట్రాక్టర్‌ను పరిశీలించారు. సరైన ధ్రువ పత్రాలు లేని వాటికి జరిమానా విధించారు. సీఐ నవీన్‌కుమార్, ఎస్ఐ అశోక్ ఉన్నారు.

108లో ప్రసవం




108లో ప్రసవించిన మహిళ

కుంటాల: మండలంలోని అంబుగామ గ్రామానికి చెందిన పవార్‌రేఖ నిండు గర్భిణి. బుధవారం పురిటి నొప్పులు రాగా, కుటుంబ సభ్యులు 108కు సమాచారం ఇచ్చారు. 108 వాహనంలో ఆమెను భైంసా ఏరియాస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నట్లు ఈఎంటీ శ్రీకాంత్, పైలట్ గజేందర్ తెలిపారు.

ప్రసవం.. మరింత సులభం



జిల్లా ప్రసూతి ఆస్పత్రికి చేరిన న్యూట్రిషన్ కిట్లు



కిట్‌లో ఉండే వస్తువులు

- త్వరలో న్యూట్రిషన్ కిట్ల పంపిణీ
- తల్లీబిడ్డల ఆరోగ్యానికి ప్రాధాన్యం
- ఇప్పటికే ఆస్పత్రులకు చేరిన కిట్లు
- పంపిణీకి వైద్యాధికారుల ఏర్పాట్లు
- ఒకొక్కరికి రెండు చొప్పున పంపిణీ
- జిల్లాకు 1,020 కిట్ల కేటాయింపు

నిర్మల్‌చైన్‌గేట్: గర్భిణుల్లో రక్తహీనతను నివారించడం ద్వారా మాతాశిశు మరణాల రేటును పూర్తిగా తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ పథకం త్వరలో జిల్లాలో అమలుకానుంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచడమే లక్ష్యంగా అమలు చేసిన ఈ పథకం విజయవంతమైన విషయం తెలిసిందే. రక్తహీనతతో బాధపడుతున్న మహిళలు ఎక్కువగా ఉన్న తొమ్మిది జిల్లాలను మొదట పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి అమలు చేసింది. ఆయా జిల్లాల్లో పథకం మంచి ఫలితం ఇవ్వడంతో రాష్ట్రంలోని మిగతా అన్ని జిల్లాల్లోనూ న్యూట్రిషన్ కిట్ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు మంగళవారం ఆయా కలెక్టర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో వచ్చే నెలలో కేసీఆర్ కిట్ల పంపిణీకి సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

5,924 మంది లబ్ధిదారులు

జిల్లా వ్యాప్తంగా 5,924 మంది గర్భిణులున్నారు. వీరిలో చాలామంది గ్రామీణ ప్రాంతాలు, గిరిజన తండాల్లోని మహిళలు. వీరిలో ఎక్కువమంది రక్తహీనత (ఎనీమియా)తో బాధపడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ప్రసవ సమయంలో కొందరు విషమ పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేస్తోంది. కేసీఆర్ కిట్ల పంపిణీలో భాగంగా జిల్లాకు 1,020 న్యూట్రిషన్ కిట్లు వచ్చాయి. ఇందులో నిర్మల్ ప్రసూతి ఆస్పత్రికి 387, భైంసా ఏరియాస్పత్రికి 510, ఖానాపూర్ కమ్యూనిటీ ఆస్పత్రికి 123 చేరుకున్నాయి. రక్తహీనతతో బాధపడే ఒక్కో గర్భిణికి రెండుకిట్ల చొప్పున అందించనున్నారు. నాలుగో నెలలో ఒకటి, ఐదోనెలలో ఒక్కటి చొప్పున ఇవ్వనున్నారు.

'సర్కార్'లో ప్రసవాలు జరిగేలా..

సుఖప్రసవం అయినప్పుడే తల్లీబిడ్డా ఆరోగ్యంగా ఉంటారని ప్రభుత్వం భావించి వైద్యారోగ్య రంగానికి పెద్దపీట వేస్తోంది. సర్కార్ దావాఖానాలోనే ప్రసవాలు జరిగేలా కార్యాచరణ రూపొందించింది. ఇందుకు ఆధునాతన వసతులతో ఆస్పత్రులను నిర్మించి సౌకర్యాలు కల్పిస్తోంది. జిల్లా కేంద్రంలోని మాతాశిశు ఆస్పత్రిలో ప్రతీనెల 350 నుంచి 400 ప్రసవాలు, నర్సాపూర్, భైంసా, ఖానాపూర్ ఆస్పత్రుల్లోనూ ప్రసవాలు జరుగుతున్నాయి. రక్తహీనతతో పాటు ఇతర సమస్యలతో బాధపడుతున్న వారికి నిర్మల్ ఎంసీహెచ్ వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నారు. గర్భిణీగా నిర్ధారణ అయ్యాక క్రమంగా ఆస్పత్రికి వచ్చేవారికి వివిధ పరీక్షలు చేస్తున్నారు. తొమ్మిది నెలలపాటు బలవర్ధకమైన ఆహారంతోపాటు రోజుకు ఒక గుడ్డు, పాలు ఇస్తారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లని వారికి సదరు అంగన్‌వాడీ టీచర్లు గుడ్లు, పప్పులు, పాలు ఇంటికే పంపుతారు. ఇలా ఇచ్చిన పౌష్టికాహారం గర్భిణికి అందకుంటే ఆమె రక్తహీనత సమస్య ఎదుర్కొక తప్పదు. కాన్పు సమయంలో ఇబ్బందులు పడే అవకాశం ఉంది.

న్యూట్రిషన్ కిట్‌తో ఆరోగ్యం

ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలు జరగాలని, అప్పుడే తల్లీబిడ్డా ఆరోగ్యంగా ఉంటారని, గర్భం నిర్ధారణ అయ్యాక మంచి పౌష్టికాహారం తీసుకుంటేనే సుఖప్రసవం సాధ్యమవుతుందని, లేకుంటే డెలవరీ సమయంలో ఇబ్బందులు కలుగుతాయని భావించిన ప్రభుత్వం రూ.2 వేల విలువైన న్యూట్రిషన్ కిట్‌ను గర్భిణులకు అందించనుంది. ఇందులో పోషకాహార పదార్థాలతో కూడిన పొడి ఉంటుంది. ఖర్జూర, ఐరన్ సిరప్, నెయ్యి, పల్లిపట్టీలు ఉంటాయి. గర్భ నిర్ధారణ అయ్యాక వీటిని తీసుకుంటే రక్తహీనత ఉండదని, దీంతో సుఖప్రసవాలు చేయడం సులభమని వైద్యులు చెబుతున్నారు.

న్యూట్రిషన్ కిట్‌లో ఉండేవి..

- కిలో న్యూట్రిషన్ మిక్స్ పౌడర్ (మదర్ హార్లిక్స్)
- కిలో ఖర్జూర ప్యాకెట్
- రెండు ఐరన్ సిరప్ బాటిళ్లు, 500 గ్రాముల నెయ్యి
- ఒక కప్పు
- పల్లిపట్టి 200 గ్రాములు
- ఒక బాస్కెట్

త్వరలో అందజేస్తాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అర్హులైన గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు అందించేందుకు ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే కిట్లు జిల్లా ప్రసూతి, భైంసా ఏరియా, ఖానాపూర్ ఆస్పత్రికి కిట్లు చేరాయి. 13 నుంచి 27 వారాల గర్భిణులకు మొదటి కిట్, నెల రోజుల తర్వాత రెండో కిట్ అందజేస్తాం. జిల్లాలో 5,924 మంది గర్భిణులున్నారు. 1,020 న్యూట్రిషన్ కిట్లు వచ్చాయి. జిల్లాకు 12వేల కిట్‌లు రావాల్సి ఉంది. మిగతావి త్వరలోనే వస్తాయి.

– ధనరాజ్, డీఎంహెచ్‌వో

కార్యాలయాల్లో కలెక్టర్ తనిఖీలు



ఆస్పత్రిలో పేషెంట్ కేస్ షీట్ పరిశీలిస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

ఖానాపూర్: పట్టణంలోని పలు కాలనీలతోపాటు ప్రభుత్వ కార్యాలయాలు, పలు నిర్మాణ పనులను బుధవారం కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు, ప్రభుత్వాస్పత్రి, తహసీల్దార్ కార్యాలయం, పట్టణ పార్కు, మినీస్టేడియం, సమీకృత మార్కెట్ భవన నిర్మాణాలను కలెక్టర్ స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. ఎమర్జెన్సీ సర్వీస్ అందుబాటులో ఉండేలా చూడాలని సూపరింటెండెంట్ వంశీమాధవ్‌ను ఆదేశించారు. పేషెంట్ కేస్ షీట్‌లో మూడుపూటలా డైట్ వివరాలు పొందుపర్చాలన్నారు. కాగా, అక్కడే ఉన్న పలువురు ఎక్స్‌రే గదిని సందర్శించాలని కోరారు. టెక్నీషియన్ పోస్ట్ ఖాళీగా ఉందని, త్వరలో నియమిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెరిగేలా దృష్టి సారించాలని స్టాఫ్‌నర్స్‌లు, ఏఎన్ఎంలను ఆదేశించారు. అనంతరం శిథిలావస్థలో ఉన్న తహసీల్ భవనాన్ని సందర్శించారు. పట్టణ పార్కును సందర్శించి అక్కడే ఉన్న నర్సరీలో మొక్కలు అలసత్వంగా పెట్టడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అంతకుముందు పట్టణంలోని 1, 9 వార్డుల్లో పర్యటించారు. కలెక్టర్ వెంట చైర్మన్ అంకం రాజేందర్, కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సత్యం, తహసీల్దార్ రాజమోహన్, కమిషనర్ మనోహర్, నాయకులు షబ్బీర్‌పాషా, సంతోష్, శ్రీనివాస్ ఉన్నారు.

సర్వే పూర్తి చేయాలని మంత్రికి వినతి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న కమిటీ సభ్యులు

సోన్: సేత్వారీ సర్వే పూర్తి చేయాలని బుధవారం న్యూవెల్మల్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామానికి సేత్వారీ చేయకపోవడంతో సుమారు 150 మంది రైతులు 200 ఎకరాలకు పట్టాపాసు పుస్తకాలు అందక రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ తదితర పథకాల ద్వారా లబ్ధి పొందలేకపోతున్నారని తెలిపారు. కనీసం పండించిన పంటను అమ్ముకునే అర్హత కోల్పోతున్నారని పేర్కొన్నారు. గతంలో మంత్రి ఆదేశానుసారం సోన్ తహసీల్దార్ ఆధ్వర్యంలో సర్వేయర్లు గ్రామంలో అన్ని వ్యవసాయ భూములు తిరిగి 80శాతం పూర్తిచేశారు. మిగతా సర్వే త్వరగా పూర్తి చేయాలని కోరారు. దీనికి మంత్రి, కలెక్టర్ సానుకూలంగా స్పందించి సాధ్యమైనంత త్వరలో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రెమ్మాయి సాగర్, కోశాధికారి కొండ రవి, మాజీ సర్పంచులు తోట సాయన్న, రొడ్డ రాజేశ్వర్, ఎలుగు రాజలింగం, వీ నర్సింగరావు, మెట్టు గంగాధర్, గొడుగు భూమేశ్ పాల్గొన్నారు.

అదనపు తూకం.. మిల్లుల్లో కోత



ఈ చిత్రంలో కనిపిస్తున్నది కడెం మండలం కొత్త మద్దిపడగ గ్రామానికి చెందిన రైతు లింగాల శంకర్. రెండెకరాల్లో వరి సాగు చేశాడు. ధాన్యం తూకం వేసినా లారీలు రాకపోవడంతో ఆరురోజులుగా ఇలా ధాన్యం బస్తాల వద్ద రాత్రీపగలు పడిగాపులు కాస్తున్నాడు.



మున్యాల్‌లో సాధారణ కాంటాతో తూకం వేస్తున్న హమాలీలు

- ఇబ్బందుల్లో అన్నదాతలు
- కేంద్రాల్లోనే పడిగాపులు

కడెం: తప్ప, తాలు, నాణ్యత లేమి పేరుతో ఇటు కొనుగోలు కేంద్రాల్లో.. అటు మిల్లుల్లో ధాన్యం కోతలు రైతన్నను నష్టాలపాలు చేస్తున్నాయి. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర ఇస్తున్నామని ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆచరణలో కనిపించడంలేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా 223 కేంద్రాలు

యాసంగి వరి ధాన్యం కొనుగోళ్ల కోసం జిల్లా వ్యాప్తంగా 223 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం డీఆర్డీఏ, పీఏసీఎస్, డీసీఎంఎస్, జీసీసీ ఆధ్వర్యంలో 195 కేంద్రాలు ప్రారంభించారు. వీటి ద్వారా 60,092.580 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. 48,188.480 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించారు. ధాన్యం విక్రయించిన 1,176మంది రైతులకు రూ.5.67 కోట్లు చెల్లించినట్లు అధికారులు తెలిపారు.

నాణ్యత లేమి పేరిట అదనపు తూకం

కొనుగోలు కేంద్రాల్లో నిబంధనల ప్రకారం 40కిలోల బస్తాకు అదనంగా ఒకటిన్నర కిలోలు తూకం వేయాలని అధికారులు తెలిపారు. అయితే ధాన్యంలో తప్ప, తాలు ఉందని తరుగు పేరుతో నలభై రెండు కిలోలు తూకం వేస్తున్నారు. కొన్ని కేంద్రాల్లో 42 కిలోల 200 గ్రాములు తూకం వేస్తున్నారు. చాలాచోట్ల ఎలక్ట్రానిక్ కాంటాలు లేవు. సాధారణ కాంటాలతోనే తూకం వేస్తున్నారు. ధాన్యం తరలించాక మిల్లర్లు నాణ్యత లేమి పేరిట క్వింటాల్‌కు మూడు నుంచి నాలుగు కిలోలు కోత విధిస్తున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

అదనంగా తూకం వేస్తున్నరు



కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అదనంగా తూకం వేస్తున్నరు. తూర్పార పట్టి నాణ్యమైన ధాన్యం తీసుకవచ్చినా తప్ప, తాలు పేరుతో నలభై కిలోలకు అదనంగా మరో రెండు కిలోలు తూకం వేస్తున్నరు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నరు. – గొస్కుల వెంకటేశ్, రైతు, మున్యాల్, దస్తురాబాద్

నిబంధనల మేరకే తూకం వేయాలి

రైతులు తప్ప, తాలు లేని నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 17శాతం కంటే తక్కువ తేమ శాతం ఉన్న ధాన్యం తీసుకవచ్చి విక్రయించాలి. కేంద్రాల్లో బస్తాకు అదనంగా ఒకటిన్నర కిలోలు మాత్రమే తూకం వేయాలి. – శ్రీకళ, డీఎం, మార్కెటింగ్

రూ.రెండువేల నోట్లు మార్పిడి అంతంతే!



రూ.2వేల నోట్ల మార్పిడి విషయంలో జనాల నుంచి స్పందన పెద్దగా లేదు. జిల్లా కేంద్రంలోని అన్ని బ్యాంకుల్లోనూ నోట్ల మార్పిడికి వచ్చే వారి సంఖ్య నామమాత్రమే. నిర్మల్ ఎస్బీఐ మెయిన్ బ్రాంచ్‌లో బుధవారం రూ.2వేల నోట్లు మార్చుకునేందుకు పలువురు రాగా తీసిన చిత్రమిది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

క్లుప్తంగా

కుంటాలను సందర్శించిన ట్రెయినీ ఎఫ్ఎస్ఓలు



జలపాతం విశిష్టతను ట్రెయినీ ఎఫ్ఎస్ఓలకు వివరిస్తున్న అధికారులు

నేరడిగొండ: రాష్ట్రంలోనే ఎత్తైన కుంటాల జలపాతాన్ని 21వ బ్యాచ్‌కు చెందిన 15మంది ట్రెయినీ ఎఫ్ఎస్ఓలు ఏసీఎఫ్ టూర్ ఇన్‌చార్జి సునితతో కలిసి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారికి సిరిచెల్మ రేంజ్ అధికారి గణేష్, సెక్షన్ ఆఫీసర్ వసంత్, బీట్ ఆఫీసర్ సచిన్‌లు స్వాగతం పలికారు. సిరిచెల్మ రేంజ్ అధికారి కుంటాల జలపాతం విశిష్టతను వివరించారు. ఈడీసీ కమిటీ, సిరిచెల్మ రేంజ్, తదితర అంశాలపై వివరించారు. కాగా ట్రెనీ ఎఫ్ఎస్ఓలు జలపాతం అందాలను వీక్షించి ఆనందించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

తగాదాలో గాయపడ్డ వ్యక్తి మృతి



కొల్లూరి నర్సయ్య మృతదేహం

గుడిహత్నూర్: చిన్నపాటి తగాదా ఓ వ్యక్తి ప్రాణం తీసింది. మండలంలోని తోషం గ్రామానికి చెందిన కొల్లూరి నర్సయ్య (53) కాలనీలో జరిగిన గొడవలో తలకు గాయమై చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం... శనివారం రాత్రి 8గంటల ప్రాంతంలో నర్సయ్య తాగిన మైకంలో దావ నారాయణ అనే వ్యక్తితో తగాదా పడ్డాడు. ఈ క్రమంలో నర్సయ్యను నెట్టి వేయడంతో కిందపడి తలకు తీవ్రగాయమైంది. క్షతగాత్రుడిని అంబులెన్సులో రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



చికిత్స పొందుతున్న గంగన్న

సారంగపూర్: మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన నాకిడి గంగన్న బుధవారం జామ్ గ్రామంలోని పెట్రోల్ బంక్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు, బాధిత కుటుంబీకుల వివరాల ప్రకారం... బాధితుడు గంగన్న ఉదయం ఉపాధి హామీ పనులకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో తన మోపెడ్‌లో పెట్రోలు పోయించుకునేందుకు జామ్ గ్రామంలోని పెట్రోల్ బంక్‌కు వెళ్తున్నాడు. ఇదే సమయంలో సోన్ మండల కేంద్రానికి చెందిన నుంకరి నర్సయ్య పల్సార్ బైక్‌పై వేగంగా వచ్చి గంగన్న వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గంగన్న తలకు బలమైన గాయాలు కావడంతో స్థానికులు నిర్మల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితుడి కుమార్తె సంగీత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు.

ఆకలి తీర్చుదాం...

ఆహారం వృథాను అరికడదాం..



ఆహారాన్ని తింటున్న బాలుడు

మిగిలిపోయిన ఆహారాన్ని పంపిణీ చేస్తున్న అక్షయ పాత్ర సభ్యులు



డస్ట్‌బిన్ చేరుతున్న ఆహారం

- ప్రస్తుతం కొనసాగుతున్న పెళ్లిళ్ల సీజన్..
- శుభకార్యాల్లో భారీగా ఆహారం వృథా.
- ఆకలిగా ఉన్నవారి కడుపు నింపాలంటున్న స్వచ్ఛంద సంస్థలు

నిర్మల్‌ఖిల్లా: ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కొనసాగుతోంది. దీంతో పాటు అనేక శుభకార్యాలు నిర్వహిస్తున్నారు. ఈ శుభకార్యాల్లో ప్రత్యేక వంటల పేరుతో వివిధ రకాల ఆహార పదార్థాలు తయారు చేస్తూ విపరీతంగా వృథా చేస్తున్నారు. ఇదే సమయంలో పూటకు సరైన తిండి దొరకక అనేక మంది ఆకలితో పస్తులు ఉంటున్నారు. కొన్ని స్వచ్ఛంద సంస్థలు మిగిలిపోయిన ఆహారాన్ని సేకరించి నిరుపేదలకు పంపిణీ చేస్తున్నారు. ఈ అంశంపై 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

ఆలోచించండి..

ప్రస్తుతం శుభకార్యాల సీజన్ కొనసాగుతోంది. వీటిల్లో అనేక రకాల ఆహార పదార్థాలను తయారు చేస్తూ వండి వార్చుతున్నారు. కానీ ఇదే సమయంలో చాలా మొత్తంలో ఆహారం వృథా చేస్తున్నారు. హోదాను అనుసరించి పేద, మధ్య తరగతి కుటుంబాల వారైతే వారు చేసే పెళ్లి వేడుకలు భోజనానికి రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. ఇక ఉన్నతంగా ఉన్నటువంటి రాజకీయ నాయకులు వంటివారి కుటుంబాల్లోని వివాహాల్లో విందు కోసం పది లక్షలకు పైగా ఖర్చు చేస్తున్నారు. నిర్మల్ జిల్లాలో మొత్తం సుమారు 250 పైగా చిన్న, పెద్ద ఫంక్షన్ హాళ్లు అందుబాటులో ఉన్నాయి. పెళ్లిళ్ల సీజన్‌లో కనీసం ఒక్కో ఫంక్షన్‌హాల్‌లో దాదాపు 15 నుంచి 20వరకు పెళ్లిళ్లు మరో 20 ఇతర శుభకార్యాలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లోని ఫంక్షన్ హాల్‌లో ఆహారం ఎక్కువగా వృథా అవుతోంది. ఒక్కో ఫంక్షన్ హాల్‌లో దాదాపు వారు ఏర్పాటు చేసిన దాంట్లో 25–30% వరకు ఆహారం వృథా అవుతున్నట్లు అంచనా. ఈలెక్కన ఒక్కో సీజన్‌లో జిల్లాలోని అన్నీ ఫంక్షన్‌హాల్‌లో కలిపి దాదాపు 8 నుంచి 10వేల క్వింటాళ్ల ఆహార పదార్థాలు వృథా అవుతున్నట్లు తెలుస్తోంది.

'అక్షయపాత్ర' లక్ష్యం అదే...

నిర్మల్ జిల్లా కేంద్రంలోని 'నిర్మల హృదయ సేవా సమితి' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'అక్షయపాత్ర స్వచ్ఛంద సంస్థ' వారు వివిధ ఫంక్షన్ హాల్‌లో మిగిలిపోయిన ఆహారాన్ని వృథాగా పారవేయకుండా అవసరమున్న నిరుపేద కుటుంబాలు, బలహీనవర్గాల ప్రజలకు ఆస్పత్రుల్లో, వృద్ధాశ్రమాల్లో, జిల్లా కేంద్రం సమీపంలోని వెనుకబడిన ప్రాంతాలైన వైఎస్ఆర్ కాలనీ, శాంతినగర్ తదితర ప్రాంతాల్లో ఆహారాన్ని పంపిణీ చేస్తున్నారు. శుభకార్యం అనంతరం ఆహార పదార్థాలు మిగిలితే వారికి ఫోన్‌లో సమాచారం ఇస్తే వాహనంలో వచ్చి తీసుకొని బలహీన వర్గాల ప్రజలకు, రోడ్డు వెంబడి నివసించే యాచకులకు పంపిణీ చేస్తున్నారు.

ఫోన్ చేస్తే వచ్చి తీసుకెళ్తాం...



నిర్మల్ జిల్లా కేంద్రంలో 'అక్షయపాత్ర' అనే పేరుతో ఆకలితో ఉన్నవారికి ఆహారాన్ని అందిస్తున్నాం. ఏవైనా శుభకార్యాలు వంటి వాటిలో వండిన ఆహారం మిగిలిపోతే మాకు 99512 52949కు ఫోన్ చేస్తే వెంటనే వచ్చి ఆ ఆహార పదార్థాలను తీసుకెళ్తాం. వాటిని బలహీన వర్గాలు, యాచకులు వృద్ధులు వంటి వారికి అందజేస్తాం. – తాడిపెల్లి ప్రభాకర్, వలంటీర్, నిర్మల హృదయ సేవా సమితి, నిర్మల్

ఆర్థికంగా పెనుభారం..



శుభకార్యాలు వంటి వాటిల్లో అవసరానికి మించి ఆహార పదార్థాలను ఏర్పాటు చేసి వృథా చేస్తున్నారు. వివాహం, శుభకార్యం జరిపించే వారికి కూడా ఆర్థికంగా పెను భారం పడుతోంది. ఫంక్షన్‌లో మద్యం, మాంసానికి మితిమీరిన ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇది ఆర్థికంగా, ఆరోగ్యపరంగా సమంజసం కాదు. ఫంక్షన్లలో దాదాపు పావువంతు భాగం వృథా అవుతుంది. దీన్ని ఫంక్షన్లు నిర్వహించేవారు గ్రహించి వృథాను అరికట్టాలి. – నర్సయ్య లాసెట్టి, నిర్మల్

టింబర్ యార్డు కార్మికుల సమస్యలు తీర్చాలి

- హెచ్ఎమ్మెస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్



మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

శ్రీరాంపూర్: టింబర్ యార్డుల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని హెచ్ఎమ్మెస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్‌అహ్మద్ డిమాండ్ చేశారు. వారి సమస్యలపై ఆ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం స్టోర్స్ గేట్ ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టింబర్ యార్డుల్లో పనిచేస్తున్న కార్మికులు 30ఏళ్లుగా ఎదుగుబొదుగు లేని జీతాలతో నష్టపోతున్నారన్నారు. వారు చేసే పనికి నాలుగు కేటగిరీ వేతనం ఇవ్వాల్సి ఉండగా కేవలం మొదటి కేటగిరీ వేతనం పొందుతున్నారన్నారు. ఎస్‌పీఆర్పీ, ఇంక్రిమెంట్లు, అలవెన్సులు రాక ఆర్థికంగా నష్టపోతున్నారని వివరించారు. దీంతో వారు రిటైర్డ్ అయ్యాక వారికి గ్రాట్యూటీ, పెన్షన్ తక్కువగానే వస్తుందన్నారు. దీనిపై గుర్తింపు సంఘం టీబీజీకేఎస్, ఏఐటీయూసీ నేతలు పట్టించుకోవడం లేదన్నారు. దీంతో టింబర్ యార్డు కార్మికులు తమ యూనియన్‌ను ఆశ్రయిస్తే వారిపై ఈ సంఘాల నేతలు బెదిరింపులకు గురిచేస్తున్నారని వివరించారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా ఉచిత మస్టర్లు పడుతూ ఆ సంఘాల నేతలు కంపెనీకి నష్టం చేస్తున్నారన్నారు. దీంతో పాటు స్టోర్స్‌లో ప్రమాదాలు జరిగినప్పుడు ఏ మాత్రం సంబంధం లేని క్లర్కులను బాధ్యులను చేస్తూ వారిపై చర్యలు తీసుకుంటున్నారని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మహిళా ఉద్యోగులకు వాష్‌రూమ్స్ సరిగ్గా లేవన్నారు. రెస్టు హాల్స్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులను కలిసి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఆ యూనియన్ సింగరేణి విభాగం అధ్యక్షులు జక్కుల నారాయణ, బ్రాంచీ కార్యదర్శి తిప్పారపు సారయ్య, నాయకులు గొల్ల సత్యనారాయణ, డి.శ్రీనివాస్, రేగుంట సందీప్, ఎలుక నారాయణ, అశోక్, రాజ్‌కుమార్, ఐత వెంకటస్వామి, గొర్రె శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆనంద్‌పూర్‌లో ఉద్రిక్తత

- రోడ్డు పనులను అడ్డుకున్న వ్యక్తి అరెస్ట్
- పోలీస్ బందోబస్త్ నడుమ రోడ్డు పనులు



మాట్లాడుతున్న అధికారులు

జైనథ్: మండలంలోని ఆనంద్‌పూర్ గ్రామంలో బుధవారం రోడ్డు పనుల సందర్భంగా భారీ ఉద్రిక్తత నెలకొంది. జామ్ని, ఆనంద్‌పూర్ గ్రామాల మీదుగా మహారాష్ట్రను కలుపుతూ ఉన్న రోడ్డు గతంలో పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో ఉండగా, సంవత్సరం క్రితం ఆర్అండ్‌బీ శాఖకు బదలాయించారు. దీంతో అధికారులు సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డు చేయడం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే గ్రామానికి చెందిన రాంరెడ్డి అనే వ్యక్తి ఈ రోడ్డు తమ చేనులోంచి పోతుందని, అధికారులు తమకు పరిహారం ఇవ్వకుండా డబుల్ రోడ్ పనులు చేస్తున్నారని గతంలో కోర్టును ఆశ్రయించాడు. అప్పట్లో పనులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. బుధవారం ఆర్అండ్‌బీ డీఈ సురేష్ ఇతర అధికారులు, జైనథ్ సీఐ కోల నరేష్, జైనథ్, బేల, తలమడుగు, తాంసి ఎస్సైలతో కలిసి భారీ బందోబస్తుగా వచ్చి రోడ్డు పనులు ప్రారంభించారు. దీంతో విషయం తెలుసుకున్న రాంరెడ్డి అతని కుటుంబ సభ్యులతో కలిసి అక్కడికి వచ్చి అధికారులతో వాగ్వివాదానికి దిగాడు. విషయం కోర్టు పరిధిలో ఉండగా అధికారులు ఎలా పనులు చేపడుతారని ప్రశ్నించారు. దీంతో పోలీసులు అతడిని అరెస్ట్ చేసి జైనథ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడి నుంచి తలమడుగు తీసుకెళ్లి సాయంత్రం జైనథ్‌కు తీసుకొచ్చి వదిలేశారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. అధికారులు మాత్రం డబుల్ రోడ్డుకు అవసరమైన భూమి గతంలోనే సేకరించడం జరిగిందని, రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారడంతో మరమ్మతులు చేస్తున్నామని తెలిపారు.

క్యాన్సర్ బాధితుడికి అందుతున్న సాయం

సాక్షి స్పందన



ఆర్థిక సాయం అందిస్తున్న యువకులు

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె గ్రామానికి చెందిన కడమంచి రాజేష్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుదున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన రాజేష్‌కు 'ఆపన్నహస్తం అందించరూ!' శీర్షికన ఈ నెల 18న సాక్షిలో ప్రచురితమైన కథనానికి దాతలు స్పందిస్తున్నారు. గ్రామానికి చెందిన కొండేరి దినేష్‌తో పాటు పస్తం కిరణ్‌లు పలువురు దాతల నుంచి స్వీకరించిన రూ.15వేల విరాళాన్ని బాధిత కుటుంబానికి బుధవారం అందజేశారు. బాధితుడి కొడుకు, కూతురిని ఏడో తరగతి వరకు ఉచితంగా చదివిస్తానని గ్రామంలోని బ్రిలియంట్ స్కూల్ కరస్పాండెంట్ బాక నాగమొగిలి హామీ ఇచ్చారు. ఇంకా దాతలు స్పందించి ఆదుకోవాలని కుటుంబీకులు కోరుతున్నారు. దాతలు ఫోన్‌పే నంబర్ 8184888605 ద్వారా సాయాన్ని అందించాలని కోరారు.

అందని వడ్డీ రాయితీ..!



సమావేశమైన సంఘ సభ్యులు (ఫైల్)



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు కేతి వజ్రవ్వ. దండేపల్లి మండలం వెలగనూర్ ఇందిరమ్మ మహిళా సంఘం అధ్యక్షురాలు. వీరి సంఘానికి ప్రభుత్వం వడ్డీ రాయితీ కింద రూ.28వేలు ప్రకటించింది. అందుకు సంబంధించిన పత్రాన్ని మహిళా దినోత్సవం రోజున అందించింది. కానీ ఇంతవరకు తమ ఖాతాలో వడ్డీరాయితీ మాత్రం జమకాలేదని వజ్రవ్వ చెబుతోంది.

దండేపల్లి: స్వయం సహాయక సంఘాల సభ్యులకు అన్ని విధాలా చేయూత నందిస్తామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం, మహిళా సంఘాలకు బకాయిపడిన వడ్డీరాయితీలను వారివారి ఖాతాల్లో వేస్తామని మార్చి 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం ప్రకటించింది. ప్రకటన చేసి సుమారు రెండు నెలలు దాటినా ఇంతవరకు వడ్డీ రాయితీ వారి ఖాతాల్లో జమ కాక పోవడంతో స్వయం సహాయక సంఘాల సభ్యులు రాయితీ డబ్బులు ఎప్పుడు ఖాతాల్లో జమవుతాయా? అని ఎదురుచూస్తున్నారు.

రూ.12.62 కోట్లు మంజూరు..

మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా పయనించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో గ్రామీణాభివృద్ధి శాఖ, బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు అందిస్తున్నారు. ఎలాంటి వడ్డీలేకుండా రుణాలు ఇవ్వాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఇందుకు 2018–19 నుంచి ఇప్పటి వరకు వడ్డీ రాయితీ ఇవ్వలేదు. రుణాలు పొందిన సంఘం సభ్యులే బ్యాంకులో అసలుతో పాటు వడ్డీ చెల్లిస్తున్నారు. ప్రభుత్వం ఎప్పటికైనా తాము చెల్లిస్తున్న వడ్డీని రాయితీ రూపంలో తిరిగి చెల్లిస్తుందనే నమ్మకంతో ఉన్నారు. 2018–19, 2019–20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వడ్డీరాయితీలను చెల్లిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటన చేసింది. దీంతో మంచిర్యాల జిల్లాలోని 8,459 ఎస్‌హెచ్ జీలకు రూ.12.62 కోట్ల వడ్డీరాయితీలను మంజూరు చేసింది. దీంతో జిల్లాలోని మహిళా సంఘాల సభ్యుల్లో సంతోషం వెల్లివిరిసింది. కానీ రెండు నెలలు దాటిన వడ్డీరాయితీ మాత్రం అందలేదు.

వడ్డీ రాయితీ అందించాలి...

మహిళా దినోత్సవం రోజున మహిళ సంఘాలకు రెండేళ్ల వడ్డీరాయితీ అందిస్తున్నట్లు ప్రకటించింది. అందుకు సంబంధించిన పత్రాలను సంఘాల లీడర్లకు అందించారు. రెండు నెలలు గడుస్తున్నా రాయితీ మాత్రం ఖాతాల్లో జమ చేయకపోవడం బాగోలేదు. కనీసం ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వడ్డీ రాయితీనిఖాతాల్లోజమచేయాలి.– సిరికొండ ఉమా, గ్రామ సంఘం అధ్యక్షురాలు, దండేపల్లి

ఖాతాల్లో జమవుతాయి...

మహిళా సంఘాలకు రావాల్సిన వడ్డీరాయితీని ప్రభుత్వం మహిళ సంఘం బ్యాంకు ఖాతాలో జమచేస్తుంది. సంఘాలకు రావాల్సిన వడ్డీరాయితీకి సంబంధించి మహిళా దినోత్సవం రోజున పత్రాలు అందించింది. కొద్దిగా ఆలస్యమైన గ్రూపు ఖాతాలో తప్పక జమవుతాయి.

–శేషాద్రి, డీఆర్‌డీవో, మంచిర్యాల

గుడుంబా పట్టివేత



పట్టుకున్న గుడుంబాతో ఎస్సై ప్రభాకర్‌రెడ్డి

దస్తురాబాద్: మండలంలోని ఆకొండపేట గ్రామంలో అక్రమంగా గుడుంబాను విక్రయిస్తున్న రెండు ఇళ్లల్లో తనిఖీ చేసి 13లీటర్ల గుడుంబాను పట్టుకున్నారు. ఎస్సై ప్రభాకర్‌రెడ్డి వివరాల ప్రకారం.. ఆకొండపేట గ్రామంలో అక్రమంగా గుడుంబాను విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసుల ఆధ్వర్యంలో తనిఖీలు చేయగా గ్రామానికి చెందిన జాడి శంకర్ ఇంట్లో 8 లీటర్లు, మహరాజు సత్తవ్వ ఇంట్లో 5లీటర్ల గుండుబాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లుఎస్సై తెలిపారు.

గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి సెక్రటరీ జావేద్

- కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి సెక్రటరీ నదీం జావేద్

ఉట్నూర్‌రూరల్: కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా మండల నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ముందుకెళ్లాలని తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి సెక్రటరీ నదీం జావేద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని హెచ్‌కేజీఎన్ ఫంక్షన్ హాల్‌లో ఖానాపూర్ నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్ణాటక తరహాలో తెలంగాణలో సైతం అన్ని సీట్లు గెలుపు లక్ష్యంగా ముందుకెళ్లాలన్నారు. ఇది వరకే అన్ని ప్రాంతాల్లో సర్వేలు నిర్వహిస్తున్నామని, ప్రస్తుత ప్రభుత్వంపై వ్యతిరేకత స్పష్టమవుతుందని తెలిపారు. రానున్న రోజుల్లో కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీని గద్దెదింపే రోజులు దగ్గరపడ్డాయన్నారు. గ్రూపు రాజకీయాలు చేయకుండా ప్రతిఒక్కరూ పార్టీ కోసం పనిచేయాలని, సీట్ల విషయంలో అధిష్టానం నిర్ణయించడం జరుగుతుందన్నారు. మండలాల వారీగా సర్వేల అనంతరం కష్టపడి పనిచేసి ప్రజల్లో గుర్తింపు పొందిన వారిని అధిష్టానం ఆదేశాల మేరకు అభ్యర్థిని ప్రకటించడం జరుగుతుందని వివరించారు. ప్రతీ కార్యకర్త, నాయకులు కలిసి మెలసి పార్టీని బలోపేతం పనిచేస్తూ ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, జెడ్పీటీసీ చారులత రాథోడ్, రాష్ట్ర, జిల్లా నాయకులు వెడ్మ భొజ్జు పటేల్, భరత్ చౌహాన్, పెందూర్ ప్రభాకార్, వినోద్ నాయక్, చంద్రయ్య, ఎక్బాల్ పాల్గొన్నారు.





సమయపాలనేది.?

ప్రతి మూడు మాసాలకు ఒకసారి జిల్లా ప్రగతిపై చర్చ జరిగే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమయపాలన పాటించడం లేదు. సమావేశం ఉదయం 10:30 గంటలకు ప్రారంభించాల్సి ఉండగా కొంతమంది మాత్రమే వచ్చారు. తర్వాత అందరు ఒక్కొక్కరుగా రావడంతో సమావేశం ఆలస్యంగా ప్రారంభమైంది. జిల్లాలోని సమస్యలు చర్చించి పరిష్కారం చూపాల్సిన వారు సమయపాలన పాటించకపోవడం ఏమిటని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పరీక్షల్లో విద్యార్థులకు ఒక్క నిమిషం నిబంధన మాదిరిగా.. ఇలాంటి సమావేశాలకు ప్రజాప్రతినిధులు, అధికారులకు నిమిషం ఆలస్యం నిబంధన ఉండాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

–సాక్షి,ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్